సాక్షి రంగారెడ్డి
మంగళవారం। 21। ఫిబ్రవరి। 2023



కల్యాణం.. నేత్రపర్వం

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. 8లో▸

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లకు లాటరీ

సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ, పోచారంలలో రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్లలో మిగిలిన ఫ్లాట్లకు మార్చి 3న లాటరీ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ నాటికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించిన వారికి లాటరీ ద్వారా ఫ్లాట్లను కేటాయిస్తారు. ట్రిపుల్ బెడ్రూమ్‌కు రూ.3 లక్షలు, డబుల్ బెడ్రూమ్‌కు రూ.2 లక్షలు, సింగిల్ బెడ్రూమ్‌కు రూ.లక్ష చొప్పున టోకెన్ చెల్లించిన వారు లాటరీలో పాల్గొనవచ్చు.

ఐదుగురు ఇండిపెండెంట్ల నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గానికి సోమవారం ఐదుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మాడిశెట్టి తిరుపతి, చాలిక చంద్రశేఖర్, చాలిక పార్వతి, పాపన్న గారి మాణిక్ రెడ్డి, మారంపల్లి లక్ష్మీనారాయణ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు.

న్యూస్‌రీల్

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం 65 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. వాటిని వివిధ శాఖల అధికారులకు అందజేసి పరిష్కారమార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సహజ యోగ, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న గురుజీ సమర్థ్ గురు సిద్ధార్థ్ ఔలియా

నందిగామ: సహజ యోగ, ధ్యానంతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికంగా ప్రశాంతంగా ఉంటారని ఓశాధార నానక్ ధామ్ మూర్తాల్ (ఓఎస్‌డీఎం) సంస్థ గురూజీ సమర్థ్ గురు సిద్ధార్థ్ ఔలియా అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ధ్యాన్ యోగా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..యోగ ప్రక్రియలో అనేక రకాలు ఉన్నాయని, ఒక్కో ప్రక్రి య ద్వారా ఒక్కో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానసికంగా ప్రశాంతంగాఉండాలంటే తప్పనిసరిగా యోగ, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగలో భాగంగా ఆనంద్ ప్రజ్ఞ ద్వారా ఒత్తిడి, విసుగు తదితర సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. యోగ ప్రజ్ఞ ద్వారా ఓంకారం, ధ్యానంలో సమాధి స్థితి, దివ్యస్మరణ పొందుతారని వివరించారు. ఓఎస్‌డీఎం ఆధ్యాత్మిక, శాస్త్రీయ సంస్థ అని, దీని ద్వారా సనాతన ధర్మం యొక్క ఆధ్యాత్మికతను, శాస్త్రీయతను వెల్లడిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆచారులు, గురువులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

భార్యను చంపిన భర్త

మొయినాబాద్: మద్యానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తి తన భార్యను దారుణంగా కొట్టి చంపాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాచారం గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్, అతని భార్య హుస్సేన్ బీ(50) కొంత కాలం క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. విజయనగర్ కాలనీలో ఓ గుడిసె వేసుకుని ఉంటూ భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హుస్సేన్ మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో అప్పటికే మత్తులో ఉన్న హుస్సేన్ కర్రతో భార్య కాళ్లపై కొట్టాడు. ఆమె కింద పడిపోవడంతో రుబ్బురోలు రాయితో ఛాతి, ముఖంపై బలంగా మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


షాద్‌నగర్ డిపోకు రూ.5.25 లక్షల ఆదాయం



డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆర్టీసీ షాద్‌నగర్ డిపో నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపించింది. వీటిల్లో 18 వేల మంది ప్రయాణించగా రూ.5.25లక్షల ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ ఉష సోమవారం తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 17 నుంచి 20 వరకు ప్రతి రోజు 20 ప్రత్యేక బస్సులు నడిపించింది. రామేశ్వరం వెళ్లేందుకు షాద్‌నగర్, కొందుర్గు మండల కేంద్రం నుంచి అధికారులు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు.

పరిహారం.. స్వాహా పర్వం!



భూదాన్ భూమి

ఫార్మాసిటీ భూ సేకరణలో భారీగా అవకతవకలు

- తాడిపర్తిలో 250 ఎకరాల భూదాన్ భూములు మాయం
- కుర్మిద్దలో నకిలీ అసైన్డ్‌దారులకు నష్టపరిహారం చెల్లింపు
- బహిరంగ విచారణకు తాడిపర్తి, కుర్మిద్ద రైతుల డిమాండ్
- అంతా పారదర్శకమే అంటున్న రెవెన్యూ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔషధనగరి భూసేకరణలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఖరారులో భారీగా చేతులు మారాయి. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల చేతివాటంతో అర్హులకు అందాల్సిన పరిహారం కాస్తా అక్రమార్కుల జేబుల్లోకి చేరింది. అసైన్డ్ భూముల సేకరణ, పరిహారం చెల్లింపులో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫార్మాసిటీ కోసం టీఎస్‌ఐఐసీ సేకరించిన అసైన్డ్ భూముల పరిహారం ఖరారు, లబ్ధిదారుల ఎంపికలో శాస్త్రీయత పాటించకపోవడంతో అక్రమాలకు తావిచ్చినట్లు తెలుస్తోంది. యాచారం మండలం తాడిపర్తి, కుర్మిద్ద రెవెన్యూ పరిధిలోని భూముల సేకరణ, నష్ట పరిహారం చెల్లింపుపై 'సాక్షి ప్రతినిధి బృందం' క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి.

బినామీల ఖాతాల్లో నష్టపరిహారం

ఫార్మాసిటీ కోసం కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల నుంచి 19,333 ఎకరాలను సేకరించాలని నిర్ణయించి.. తొలిదశలో పది వేల ఎకరాలు సమీకరించారు. వీటిలో ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, పట్టా భూములు ఉన్నాయి. అసైన్డ్‌దారులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ.8 లక్షలు చెల్లించగా, పట్టాదారులకు రూ.16 లక్షలు ప్రభుత్వం చెల్లించింది. అసైన్డ్, భూదాన్, ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లింపులో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అప్పటి వరకు రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా ఉన్నవి కాస్తా ఆ తర్వాత పట్టా భూములుగా మారాయి. ఈ భూముల్లో పొజిషన్‌లో ఉన్నవారికి తెలియకుండానే అదనంగా మరికొందరి పేర్లు కబ్జాకాలమ్‌లో చేరాయి. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులను పక్కన పెట్టి బినామీల పేర్లతో పరిహారం కాజేసినట్లు సమాచారం.

తాడిపర్తిలో 250 ఎకరాల భూదాన్ భూమి మాయం

యాచారం మండలం తాడిపర్తి రెవెన్యూ పరిధిలో 648.34 ఎకరాల భూమిని సేకరించారు. సర్వే నంబర్ 104లో 250 ఎకరాల భూదాన్ భూమి కూడా ఉంది. ఈ భూమిని బొక్క సీతారెడ్డి, బొక్క కృష్ణారెడ్డి, బొక్క రాంరెడ్డి, బొక్క సుదర్శన్‌రెడ్డి కుటుంబం 1954లోనే భూదాన్ యజ్ఞ బోర్డుకు దానం చేసింది. రెవెన్యూ రికార్డుల్లో కారీజు ఖాతాగా నమోదు చేసి, దీనిలో కొంత భూమిని నిరుపేదలకు దానం చేశారు. నిజానికి ఎవరైనా ఒకసారి భూదాన్‌బోర్డుకు భూమిని వితరణ చేసిన తర్వాత తిరిగి తీసుకునే హక్కు లేదు. ఫార్మాసిటీ భూ సేకరణ ప్రకటన తర్వాత ఈ భూదాన్ భూమికి నకిలీ వారసులు పుట్టుకొచ్చారు. ఈ భూములకు తామే హక్కుదారులమని పేర్కొంటూ బడాబాబులకు రిజిస్ట్రేషన్ చేశారు.అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా వారికి అండగా నిలిచింది. అంతా కలిసి భూదాన్ భూములను మాయంచేశారు.భూ సేకరణలో భాగంగా ప్రభుత్వంచెల్లించిన నష్టపరిహారాన్ని సొంత ఖాతాల్లో జమ చేసుకున్నారు.

కుర్మిద్దలో నకిలీలకు నష్టపరిహారం

కుర్మిద్దలోని సర్వే నంబర్ 39లో 112 ఎకరాల సీలింగ్ భూమిని 86 మందికి అసైన్డ్ చేశారు. ఫార్మాసిటీ కోసం ఈ భూములు సేకరించారు. కబ్జాలో ఉన్న బాధితులకు బదులు భూమితో సంబంధం లేని వారికి అధికారులు పరిహారం కట్టబెట్టారు. కబ్జాలో ఉన్న బాధితులకు విషయం తెలిసి లబోదిబోమంటున్నారు. న్యాయం చేయాలంటూ గోపల్లి అంజయ్య, గోపల్లి సాలయ్య, తెల్గమల్ల సంజీవ నాలుగేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. అవార్డు పాసైనట్లు అధికారులు చెబుతున్నప్పటికీ వారి ఖాతాల్లో పరిహారం జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆ యా భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు.

అక్రమాలకు తావులేదు

ఫార్మాసిటీ భూ సేకరణ అంతా పారదర్శకంగా జరిగింది. కొంత మంది కావాలనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. నాకంటే ముందే ఇక్కడ ఆర్డీఓగా పని చేసిన అధికారి భూదాన్ భూములపై ఆరా తీశారు. అన్నీ నిర్ధారించుకున్న తర్వాతే పట్టాదారుల పేర్లు నమోదు చేశారు. అక్రమాలకు తావులేదు. ఎలాంటి విచారణకైనా సిద్ధం.

– వెంకటాచారి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

సమస్య పరిష్కారం కాలేదు



సర్వే నంబర్ 39లో 1.12 ఎకరాల భూమి ఉంది. 2017లోనే ఫార్మాసిటీ కోసం తీసుకున్నారు. 40 ఏళ్లుగా కబ్జాలో ఉన్నాను. నాకు రావాల్సిన నష్టపరిహారం నకిలీ పాసుపుస్తకాలు ఉన్న వాళ్ల ఖాతాలో జమైంది. న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం సమస్య పరిష్కారం కాలేదు.

– గోపల్లి అంజయ్య, కుర్మిద్ద

పరిహారం రాకుండా చేశారు



భూదానోద్యమంలో పాల్గొన్నాను. సర్వే నంబర్ 104 ఎండ్లకంచె (భూదాన్ భూమి)లో మూడెకరాలు ఇచ్చారు.రాళ్లు, రప్పలతో ఉన్న భూమిని చదును చేసుకున్నాం.అప్పట్లో జొన్నలు, నువ్వులు, ఆముదాలు పండించాం. మా కబ్జాలో ఉన్న భూములను బలవంతంగా లాగేసుకున్నారు. రావాల్సిన పరిహారాన్ని రాకుండా అడ్డుకున్నారు.

– బద్దుల సత్తెమ్మ, తాడిపర్తి

సమగ్ర విచారణ జరిపించాలి



ఎకరానికి రూ.16 లక్షలతో పాటు 120 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వానికి రూ.70 కోట్లు పరిహా రం రూపంలో కోల్పోవాల్సి వచ్చింది. తాడిపర్తి భూదాన్ భూములపై బహిరంగ విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన ఆర్డీఓ సహా ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇటీవల కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశాం.

– మధుసూదన్, ఆరోగ్య తెలంగాణ కో ఆర్డినేటర్



సిరిపురం యాదయ్య విగ్రహావిష్కరణలో మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు

అమరుల త్యాగం వెలకట్టలేనిది

సిరిపురం యాదయ్య విగ్రహావిష్కరణలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన సిరిపురం యాదయ్య ఆశయాలను సాధిస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ అమరుడు సిరిపురం యాదయ్య 13వ వర్ధంతి సందర్భంగా సోమవారం మహేశ్వరం గేటు కమాన్ వద్ద ఆయన విగ్రహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరుల త్యాగం వెలకట్టలేనిదన్నారు. యాదయ్య 21 ఏళ్ల వయస్సులో తెలంగాణ సాకారం కోసం ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ప్రాణత్యాగం చేశాడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అమరుల త్యాగం వృథా కాకుడదని, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఆర్థికసాయం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలిచారన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లు మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి, కార్యదర్శి అంజయ్య ముదిరాజ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎంఏ సమీర్, మహేశ్వరం, కందుకూరు మండలాల, తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంగోత్ రాజు, మన్నె జయేందర్, జె.లక్ష్మయ్య, యాదగిరి గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కులవృత్తుల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

- వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి



సమావేశంలో రవీంద్రచారి తదితరులు

షాద్‌నగర్: కులవృత్తుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో విశ్వ బ్రాహ్మణ వృత్తి కళాకారులకు సోమవారం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రచారి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కులవృత్తులను ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టిందన్నారు. ప్రభు త్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వృత్తి కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందాలనుకునే వారు సొసైటీగా ఏర్పాటు కావాలని సూచించారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు సంబంధించిన టెక్నికల్ ఏజెన్సీ వారు త్వరలో షాద్‌నగర్ ప్రాంతానికి విచ్చేస్తున్నట్లు తెలిపారు. వారి సలహాలు, సూచనలు పాటించి ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వంశపారంపర్య వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో కౌశల్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు గందాల శ్రీనివాస్‌చారి, శ్రీవర్ధన్‌రెడ్డి, ఆసం కళాధర్, శ్రీనివాస్‌చారి,రాజు, అశోక్, రాజేష్, శ్రీనివాస్‌చారి, డిస్కో శ్రీను పాల్గొన్నారు.



ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

బంజారాహిల్స్: మూడు రోజుల పాటు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణలో జరగనున్న సూ త్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. అరుదైన కలర్‌ఫుల్ కాంబినేషన్‌లో డిజైనర్ దుస్తు లు, ఆభరణాలు, సౌందర్య ఉత్పత్తులు, గృహాలంకరణ సామగ్రి, వినియోగ వస్తువులు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముంబై, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూరు, కోయంబత్తూరు తదితర నగరాల నుంచి ఫ్యాషన్, డిజైనరీ బ్రాండ్లు ప్రదర్శనలో తమ ఉత్పత్తులను ఉంచాయి.

కాలుష్యానికి కళ్లెం వేద్దాం

- వాయు కాలుష్యం, ఈ– వేస్ట్ నియంత్రణపై పీసీబీ నజర్
- కేంద్ర నిధులతో గ్రేటర్‌లో కాలుష్యం తగ్గింపునకు చర్యలు
- ఈ– వేస్ట్, నిర్మాణ వ్యర్థాల నియంత్రణ, శుద్ధి పాలసీపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: వాయు కాలుష్యం, ఈ– వేస్ట్ నియంత్రణ, నిర్మాణ వ్యర్థాల కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి దృష్టి సారించింది. ఇందు కోసం అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళిక అమలు తీరుపై రాష్ట్ర పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ సోమవారం పీసీబీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఐఐటీ కాన్పూర్ నిపుణులు ప్రొఫెసర్ ముఖేష్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సూక్ష్మ, స్థూల ధూళి కాలుష్యం ఉత్పన్నమయ్యేందుకు గల కారణాలను తన అధ్యయన నివేదిక ఆధారంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దెబ్బతిన్న రహదారులపై దుమ్ము, ధూళి అధికంగా వెలువడడం, కాలం చెల్లిన వాహనాలను నుంచి వెలువడుతున్న అపరిమిత ఉద్గారాలు, ఘన వ్యర్థాలను బహిరంగంగా దహనం చేయడం, కాలుష్య కారక పరిశ్రమలు వెలువరిస్తున్న వ్యర్థాల వివరాలను విశ్లేషించారు.

కాలుష్యం తగ్గింపునకు కేంద్ర నిధులు..

గ్రేటర్ పరిధిలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేయనున్నట్లు రజత్‌కుమార్ తెలిపారు. ఈ నిధులతో కాలుష్య కట్టడికి పలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ– వ్యర్థాల నియంత్రణపై..

ఈ వ్యర్థాల సేకరణలో పీసీబీ అమలు చేస్తున్న విధానాల కారణంగా ఏటా 30 వేల టన్నుల నుంచి 44 వేల టన్నుల మేర వ్యర్థాలను సేకరించి శుద్ధి చేస్తున్నామన్నారు. ఈ– వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ శుద్ధి కోసం పలువురికి శిక్షణనివ్వడం సవాలుగా మారిందన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలపై..

వ్యర్థాల సేకరణ, శుద్ధి సామర్థ్యాన్ని నిత్యం 1000 నుంచి 2000 టన్నుల సామర్థ్యానికి పెంచినట్లు తెలిపారు. శుద్ధి చేసిన వ్యర్థాలను విధిగా వివిధ ప్రాజెక్టులలో తిరిగి ఉపయోగించడాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు.







సాయన్నా.. ఇక సెలవ్

బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయుల అశ్రునయనాల నడుమ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు ముగిశాయి. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కార్ఖానాలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర సాయంత్రం 5 గంటలకు మారేడుపల్లి శ్మశాన వాటికకు చేరుకుంది. అధికార లాంఛనాలతో సాయన్న అంత్యక్రియలు నిర్వహించడం లేదని తెలుసుకున్న ఆయన అభిమానులు ఒక్కసారిగా ఆందోళకు దిగారు. రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక దళిత సంఘాల నేతలు, కార్యకర్తల ఆందోళన కారణంగా దాదాపు రెండు గంటల పాటు **అంత్యక్రియలు నిలిచిపోయాయి.** ఎట్టకేలకు కుటుంబ సభ్యుల విజ్ఞప్తితో రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు జరిగాయి.

ఆఖరు దాకా ఉన్న ఆప్తమిత్రులు

సాయన్నతో రాజకీయాలతో పాటు వ్యక్తిగత అనుబంధం కలిగిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, మైనంపల్లి హన్మంతరావులు మధ్యాహ్నం ఒంటి గంటకు కార్ఖానాకు చేరుకున్నారు. సాయన్న అంతిమ యాత్ర ప్రారంభం కాగానే కాలినడకనే కొద్దిదూరం వరకు వచ్చిన నేతలు, రెండు గంటల అంతియ యాత్రలో పాల్గొన్నారు.

– కంటోన్మెంట్

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

ఎంపీ రంజిత్‌రెడ్డి



యాదయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించిన సిరిపురం యాదయ్య త్యాగం వెలకట్టలేనిదని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డా. గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదయ్య 13వ వర్ధంతిని పురస్కరించుకుని తరంగ ఫౌండేషన్ చైర్మన్ సిలివేరు వెంకట్‌కుమార్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సుదీర్ఘంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో సిరిపురం యాదయ్య లాంటి యువకులు అనేక మంది ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలను తెలంగాణ ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఫలాలను ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బీఆర్‌ఎస్ యువజన నాయకులు కార్తీక్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, వీరమల్ల రాంనర్సింహాగౌడ్, పురుషోత్తంరావు, మహేందర్ యాదవ్, లోకసాని కొండల్‌రెడ్డి, అంకిరెడ్డి, మహ్మద్ సలీం, ఋషి పాల్గొన్నారు.



అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

కొత్తూరు: డీసీఎం వ్యాన్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన కొత్తూరు పరిధిలోని తిమ్మాపూర్-చేగూరు ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన మల్లయ్య(62) నందిగామ మండలం ఈదులపల్లిలో నిర్వహించిన బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. ఈ నేపథ్యంలో కుమ్మరిగూడ వద్దకు రాగానే తిమ్మాపూర్ నుంచి వెళ్తున్న డీసీఎం, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శివాలయంలో అన్నదానం

శంషాబాద్ రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దగోల్కొండలోని భగీరథ శివాలయంలో స్వామి కల్యాణం అనంతరం సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ స్వరూప నర్సింహగౌడ్, అన్నదాత శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరక్టర్ శ్రీకాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివపార్వతులకు కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



పట్టువస్త్రాలు తెస్తున్న కార్తీక్‌రెడ్డి దంపతులు

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

- తరలివచ్చిన ప్రముఖులు, భక్తజనం
- శివగంగ ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- అలరించిన నాటికలు, భక్తి గీతాలు



కల్యాణ వేడుకకు హాజరైన భక్తజన సమూహం

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో మంత్రి సబితారెడ్డి తనయుడు, ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, స్రవంతి దంపతులు, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. పుర వీధుల్లో శివపార్వతుల విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఆలయం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, భజనలతో మార్మోగింది. పూజల అనంతరం కార్తీక్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆలయం వద్ద ఏసీపీ అంజయ్య, సీఐ మధుసూదన్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఆలయ ఈఓ మురళీకృష్ణ, డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాల్‌రాజ్, మహేందర్, రవీందర్, వెంకటేష్, సర్పంచ్ కర్రోళ్ల ప్రియంక, ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్, మాజీ చైర్మన్లు కూన యాదయ్య, ఎం.నవీన్, కాకి ఈశ్వర్, కాకి కుమార్, నాగేశ్వర్, శివమూర్తి, తురాయి ఏకలవ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంబయ్య యాదవ్, మనోహర్, ప్రభాకర్, బాలయ్య, కృష్ణ, వీరుబాబు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఓంకార నామస్మరణంతో మార్మోగింది. శివపార్వతులకు హారతి, అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, రుద్రాభిషేకం నిర్వహించారు. శివగంగ చుట్టూ కొలువుదీరిన పదహారు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మాదే అధికారం

ఎమ్మెల్యే ఈటల రాజేందర్

- కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేయండి
- తలకొండపల్లిలో 'ప్రజల గోస – బీజేపీ భరోసా'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

తలకొండపల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి అందుతున్న నిధులు, సంక్షేమ పథకాల్లో వాటాపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. సోమవారం తలకొండపల్లిలో ప్రజల గోస – బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీకి వస్తున్న నిధుల్లో కేంద్రం వాటా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం లేదన్నారు. 57 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పిన కేసీఆర్ కొందరికి మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ చేయకుండా అన్నదాతల కళ్లల్లో మట్టి కొట్టారని ఆరోపించారు. సకాలంలో, ధాన్యం కొనుగోలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతోందని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. అయితే ఇవేవీ సాకారం కాలేదన్నారు. నిరుద్యోగ భృతి అటకెక్కిందన్నారు. డబుల్ ఇళ్లు మంజూరు కావడం లేదని ఆరోపించారు. రాష్ట్రం మద్యం ఏరులై పారుతోందన్నారు. తాగుడుకు బానిసై వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాగ ఉండి ఇళ్లు కట్టుకోలేని వారికి రూ. 3లక్షలు ఇస్తామని ప్రకటించారని, పెరిగిన సిమెంట్, స్టీల్ ధరలకు అవి ఏ మాత్రం సరిపోవన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలన చేస్తుంటే జీర్ణించుకోలేక కేంద్రంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

హామీల అమలులో విఫలం

రాష్ట్రంలో నియంతపాలన సాగుతోందని, ప్రజకిచ్చిన హామీలను అమలు పర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. భూమి ఉన్న వాళ్లకే రైతు బీమా వస్తోందని, భూమిలేని నిరుపేదల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలని సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్‌భవ తదితర సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటిని ప్రజలందరు ఉపయోగించుకోవాలన్నారు. కేసీఆర్ సర్కార్ ప్రజాసామ్య విలువలను కాలరాస్తోందని, కేసీఆర్ చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాండు, పాండుప్రసాద్, సర్పంచ్ కుమార్, శేఖర్‌గౌడ్, కాసుల వెంకటేశ్వరావు, సుదర్శన్, ఎంపీటీసీ హేమరాజు, మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు శ్రీకాంత్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం



మణికొండ: పాటల పోటీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీహర్షిత, కృష్ణ ప్రసన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాయిస్ ఆఫ్ హైదరాబాద్ 23 బ్యానర్‌పై చైతన్య స్పందన, చైతన్యగీతివారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మార్చి 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలో పాల్గొనే అభ్యర్థులకు మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో, రెండు, మూడో రౌండ్లు ఆఫ్ లైన్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మూడో రౌండ్ సీబీఐటీ కళాశాలలో ఉంటుందన్నారు. విజేతలకు రూ.30 వేల ప్రైజ్‌మనీ అందిస్తారన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ ప్రతిభను ఈ వేదిక ద్వారా నిరూపించుకోవడానికి సదావకాశమని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్లు 8688286682, 9392 846264లో సంప్రదించాలని కోరారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

బడంగ్‌పేట్: ఇటీవల జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బడంగ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సీబీఎం కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అండర్ –18 లాంగ్ జంప్ బాలుర విభాగంలో లస్కర్ నవీన్ (9వ తరగతి) ప్రథమ బహుమతి సాధించాడు. 100 మీటర్ల పరుగు పందెంలో బీ సురేష్(9వ తరగతి) మొదటి స్థానంలో నిలిచాడు. లాంగ్ జంప్‌లో సిద్ధార్థ(9వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో నరేష్ మొదటి స్థానంలో, 200 మీటర్ల రన్నింగ్‌లో సాయి యశ్వంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. అలాగే 400 మీటర్ల పరుగు పందెంలో అరుణ్ ద్వితీయ స్థానం పొందగా, సాయిజగన్ తృతీయ స్థానంలో నిలిచాడు. ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం పాఠశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే అర్జున్, ఉపాధ్యాయులు జ్యోతి, రాజశేఖర్, వెంకటరమణారెడ్డి, వెంకట్‌నారాయణరెడ్డి, సంగీత, వనజ, ప్రతాపరెడ్డి, హరికృష్ణ, శోభారాణి, సంతోష, సూర్యప్రభ, సత్యనారాయణగౌడ్, జానకిరాం, సులోచన, మురళీకృష్ణ, భీమాగౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజారంజక పాలన బీజేపీతోనే సాధ్యం

పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పు బాషా

కందుకూరు: ప్రజారంజక పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దెబ్బడగూడలో ఆదివారం రాత్రి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తూ తెలంగాణను అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలు తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను దారి మళ్లిస్తున్నారే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ మండల అధ్యక్షుడు అనేగాని అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మీదేవేందర్‌రెడ్డి, పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొంతం జంగారెడ్డి, మండల అధ్యక్షుడు క్లాం చెన్నారెడ్డి, జిల్లా యువ మోర్చా కార్యదర్శి క్లాం సుధాకర్‌రెడ్డి, మండల యువ మోర్చా ఉపాధ్యక్షుడు సామల దయాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఎల్మటి అశోక్‌రెడ్డి, శ్రీరాములు, బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మంద పాండు, సహ ఇన్‌చార్జ్ సురసాని భూమిరెడ్డి, బూత్ అధ్యక్షులు కర్రె అరవింద్, క్లాం సందీప్‌రెడ్డి, గణేష్‌దేవ్ పాల్గొన్నారు.